క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధరూరు: మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ అండర్ –16 విభాగంలో రేవులపల్లి విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన అనురాధ, గీతాంజలి, సింధు, హర్షవర్ధన్, జ్యోతిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు రజనీకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



ధరూరు: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. గద్వాల–రాయచూరు రాహదారిలో కోతులగిద్ద స్టేజీ వద్ద ఎయిర్ వాల్వు కట్ అయి పెద్ద ఎత్తున తాగునీరు ఎగిసి పడింది. ఒకానొకదశలో ఫౌంటేన్‌ను తలపించింది. ఉదయం 6 గంటల నుంచి దాదాపు గంట పాటు ఇలా నీళ్లు వృథా అయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాలపైకి నీళ్లు ఎగిసి పడ్డాయి. ఆ తరువాత మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది నీటి పంపింగ్‌ను నిలిపేసి మరమ్మతులు చేశారు.

బాలబాలికలకు సమాన అవకాశాలు

రాజోళి: విద్యా వికాసం పొందడంలో బాలబాలికలకు సమాన అవకాశాలు అనే వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎంఈఓ నర్సింహులు విడుదల చేశారు. మండల కేంద్రంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికీ సమాన హక్కులున్నాయని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోపాల్, మాజీ ఎంపీటీసీ గంగి రెడ్డి, ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ హనిమి రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో హెల్పర్ మృతి

ఎర్రవల్లిచౌరస్తా: విద్యుదాఘాతంతో ప్రైవేట్ హెల్పర్ మృతి చెందిన సంఘటన ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఇటిక్యాల మండలంలోని షాబాద్‌కు చెందిన రాణా ప్రతాప్(30) ఎర్రవల్లి మండల కేంద్రంలో ప్రైవేట్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రవల్లి ఫార్మసీ కాలేజీ వెనకాల ఉన్న 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. దీనిపై విద్యుత్ ఏఈ వెంకట్రామ్‌ను వివరణ కోరగా ఎల్సీ లేకుండానే మరమ్మతులు చేయడంతోనే విద్యుత్ షాక్‌కు గురైనట్లు తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజోళి ఎంపీడీఓగా రమేష్ కుమార్

రాజోళి: మండల నూతన ఎంపీడీఓ డీ రమేష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న గోవిందురావ్ నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రమేష్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు అందరికి అందుబాటులో ఉంటానని, సమస్యలు తన దృష్టికి తేవాలని ఆయన తెలిపారు.

అయిజ ఎంపీడీఓగా వెంకటయ్య

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన సాయిప్రకాష్ బదిలీ కావడంతో ఆయన స్థా నంలో వెంకటయ్య నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ మేడ్చల్ జిల్లా మెప్మా కార్యాలయంలో ఏఓగా బదిలీ అయ్యారు.

కేటీదొడ్డి ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

కేటీదొడ్డి: నూతన ఎంపీడీఓగా రాములు నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహ్మ ద్ అజార్ మోహిద్దీన్ ఇటిక్యాల మండలానికి బదిలీపై వెళ్లారు. నల్లగొండ జిల్లా నుంచి రాములు నాయక్ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇద్దరిని అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఏపీఓ కుమార్, నాయకులు చక్రధర్ ఉన్నారు.

మానవపాడు ఎంపీడీఓగా..

మానవపాడు: ఉండవెల్లిలో ఎంపీడీఓ పనిచేస్తూ బదిలీపై మానవపాడు ఎంపీడీఓగా ఆంజనేయరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కార్యాలయంలోని సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మల్దకల్ ఎంపీడీఓగా..

మల్దకల్: మల్దకల్ ఎంపీడీఓగా హరికృష్ణ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తు న్న కృష్ణయ్య సిద్దిపేటకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో హరికృష్ణ వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్తు న్న కృష్ణయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. బాధ్యతలు చేపట్టిన హరికృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు నూతన ఎంపీడీఓ ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- 'పది'కి ప్రత్యేక తరగతులు
- విద్యార్థుల గ్రూప్ చర్చల ద్వారా సందేహాల నివృత్తి
- ప్రభుత్వ పాఠశాలలపై జిల్లా అధికారుల పర్యవేక్షణ



ధరూరు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

ధరూరు: విద్యార్థి దశ దిశను మార్చే పదో తరగతి ఫలితాలను మరింత మెరుగు పరిచేందుకు ఈ సారి జిల్లాల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కసరత్తును చేపట్టారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏటా అక్టోబర్ మాసం నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించే వారు. ఈ సారి ఉత్తీర్ణత శాతం బాగా తగ్గడంతో అధికారులు నెలరోజుల ముందే ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ప్రత్యేక తరగతులు విద్యార్థుల్లో దాగి ఉన్న సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నవంబర్ 1నుంచే ప్రారంభం..

ఏటా పదో తరగతి ప్రత్యేక తరగతులు అక్టోబర్ మొదటి, లేదా చివరి వారంలో ప్రారంభిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం స్లిప్ టెస్టులు, సాయంత్రం రీడింగ్‌కు కేటాయిస్తున్నారు. ఉదయం నుంచి క్లాసులలో ఏదైనా సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు ఈ క్లాసులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఉత్తీర్ణత పెంపునకు దోహదం..

ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల సందేహాలు ఒకరినొకరు నివృత్తి చేసుకోవడంతో పాటు ఉత్తీర్ణత శాతం పెంచుకునేందుకు దోహదపడతాయి. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లాలో ఎక్కడా లేని విధంగా 1000 మందికి పైగా విద్యార్థులున్నారు. పదో తరగతిలోనే ఏ, బీ, సీ సెక్షన్లలో మొత్తం 170 మంది విద్యార్థులున్నారు. గతేడాది 69.5 శాతం ఉత్తీర్ణత నమోదు కావడంతో ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ కనబరుస్తున్నారు.

మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల వివరాలు...

పాఠశాల పేరు	విద్యార్థుల సంఖ్య
ధరూరు	174
మార్లబీడు	55
ఉప్పేరు	114
రేవులపల్లి	26
గార్లపాడు	20
అల్వాల్‌పాడు	23
కేజీబీవీ	42

ప్రత్యేక క్లాసులతో మేలు..



ప్రత్యేక క్లాసులు ఎంతగానో మేలు అవుతున్నాయి. ఇప్పటి వరకు చదువుకున్న వాటిని తిరిగి నెమరు వేసుకోవడానికి ఈ క్లాసులు ఉపయోగపడతాయి. ఈ సారి 100 శాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఆ దిశగానే మేము చదువుకుంటున్నాం.

– ఇంధు, 10వ తరగతి, ధరూరు

ముందస్తుతో ఉపయోగం..



ప్రత్యేక తరగతులు ప్రతి ఒక్కరికి ఉపయోగకరంగా ఉన్నాయి. పాఠాలు రివిజన్ చేయడం ద్వారా పూర్తిగా అర్థమవుతున్నాయి. బాగా చదివి మంచి మార్కులతో కన్న వారికి, చదువు చెప్పిన గురువులకు పేరు తీసుకు వస్తాం.

– నరేందర్‌గౌడ్, 10వ తరగతి, ధరూరు

తల్లిదండ్రులు సహకరించాలి



ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి. విద్యార్థులకు ఇతర పనులు చెప్పకుండా వారికి చదువుకునే వాతావరణం కల్పించాలి. ముఖ్యంగా పత్తి పనులకు 10వ తరగతి విద్యార్థులను వినియోగించవద్దు. అప్పుడే అనుకున్న ఫలితాలు సాధించేందుకు వీలవుతుంది.

– శ్రీనివాసులు, సోషల్ టీచర్

జోగుళాంబ మాత పాహిమాం

- ముగిసిన వార్షిక బ్రహోత్సవాలు
- కోలాహలంగా అలంపూర్ క్షేత్రం
- వేలాదిగా తరలొచ్చిన భక్తులు
- వాహనాల రాకతో ట్రాఫిక్ జాం



అలంపూర్‌లో ట్రాఫిక్ జాం కావడంతో నిలిచిన వాహనలు



అలంపూర్‌లో కలశాలతో తరలి వచ్చిన భక్తులు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం/ అలంపూర్ రూరల్/ ఉండవెల్లి: జోగుళాంబ మాత పాహిమాం అంటూ భక్తులు జోగుళాంబ మాతలను స్మరించుకుంటు దర్శించుకున్నారు. జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహోత్సవాలు వసంత పంచమిని పురస్కరించుకోని బుధవారం కన్నుల పండవగా జరిగాయి. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో దక్షిణ కాశీ క్షేత్రంలో భక్తుల కోళాహాలం నెలకొంది. ఉదయం నుంచి ఉత్సవాల ముగింపు వరకు ప్రముఖులు ఆలయాలను సందర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో క్షేత్రంలో వాహనాల రద్దీతో రాకపోకల సమస్య నెకలొంది. వార్షిక బ్రహోత్సవాలకు మండలంలోని గ్రామాల ప్రజలు అనవాయితీగా పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాల్లో తరలి రావడం జరిగింది. మండలంలోని క్యాతూర్, లింగనవాయి, కాశీపురం, సింగవరం–1, సింగవరం–2, ఇమాంపురం, భైరాపురం, బస్వాపురం గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేంగా ట్రాక్టర్‌లలో తరలి రావడం జరిగింది. పెద్ద వాహనాల రాకతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనే ఉద్దేశంతో పోలీసులు స్థానికంగా ఉన్న కోర్టు వద్దనే నిలిపివేశారు. అయితే భక్తులు అక్కడి నుంచి తమతో తెచ్చుకున్న కలశాలను శిరస్సున ధరించి ఆలయాలకు చేరుకోని తమ మొక్కులను తీర్చుకున్నారు. అదేవిధంగా ఆలయాలకు వచ్చే క్రమంలో అలంపూర్ పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు కలశాలతో అనవాయితీగా తరలి రావడంతో అందరు ఒకే సారి రావడంతో కొంత ట్రాఫిక్ సమస్య ఎదుర్కొవాల్సి వచ్చింది. స్థానికంగా అనవాయితీతో వచ్చే భక్తులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయాల సమీపంలో వాహనాలు ముందుకు వెళ్లడానికి అవకాశం లేని పరిస్థితి నెలకొంది. దీంతో కొద్దిసేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.అలంపూర్ చౌరస్తా వరకు బస్సులు ఇతర వాహనాల్లో వచ్చిన భక్తులు అక్కడి నుంచి అలంపూర్ వరకు ప్రైవేటు వాహనాల్లో రావడం జరిగింది. ఈ సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో కొద్దిసేపు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పోలీసులు, ఆలయ అధికారులు సమన్వయంతో పని చేయడంతో ఈ సారి భక్తులకు ఇబ్బందులు చాల మేరకు తగ్గడంతో ఊరట లభించిందని భక్తులు చెబుతున్నారు. బ్రహోత్సవాల్లో స్థానిక భక్తులు తమ ఆనవాయితీని కొనసాగిస్తూ ఉత్సవాలను కొనసాగించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలోని నూతనంగా నిర్మించిన మాశమ్మ ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, రామకృష్ణరెడ్డి, వెంకటేష్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

గట్టు: ఇందువాసి మాజీ సర్పంచు లక్ష్మమ్మ (82) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఇందువాసి సర్పంచుగా లక్ష్మమ్మ 2006 నుంచి 2011 వరకు పని చేశారు.ఈ విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమగ్ర విచారణ చేపట్టాలి



గద్వాల అర్బన్: సూర్యపేట జిల్లాలోని ఇమాంపేట గురుకుల విద్యార్థిని వైష్ణవి మృతిపై సిట్టింగ్ జడ్జీతో సమగ్ర విచారణ చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థిని వైష్ణవి మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారు. భువనగిరిలోని సంక్షేమ హాస్టల్‌లో భవ్య, గురుకులంలో వైష్ణవి విద్యార్థినీల మరణాలపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

అలంపూర్ సీఐగా రవిబాబు

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నూతన వలయాధికారిగా బుధవారం రవిబాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజు బదిలీపై వెళ్లడంతో.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అలంపూర్ సీఐగా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోదండాపురంలోని సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

జేఈఈలో మెరిసిన గట్టు ఆణిముత్యం

గట్టు: జేఈఈ మెయిన్స్‌లో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ప్రాణేష్ ప్రతిభను చాటాడు. జేఈఈ 2024 సెషన్‌లో చాకలి నర్సింహు లు, జయమ్మల కుమారుడు ప్రాణేష్ ఉత్తమ ర్యాంకు 98.82ను సాధించాడు. గొలిదొడ్డిలోని గురుకుల సొసైటీలో చదువుకుంటున్న ప్రాణేష్, ఇంజినీర్‌గా స్థిర పడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జేఈఈలో మంచి ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులతో పాటుగా గురుకుల సొసైటీ అధ్యాపకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

రాజోళి: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. మానవపాడు మండలం పెద్దపోతులపాడుకు చెందిన శివరామిరెడ్డి విగ్రహాన్ని అందించగా, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా విగ్రహ దాత మాట్లాడుతూ విద్యకు ప్రతిరూపమైన సరస్వతీ దేవి విగ్రహాన్ని నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది శివరామిరెడ్డి దంపతులకు శాలువా, పూలమాలు వేసి సన్మానించి, మెమొంటోలు అందచేశారు. అనంతరం 40 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అయిజ: సరస్వతీ దేవి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మండలంలోని ఉత్తనూరులో విద్యార్థులు సరస్వతీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు బహూకరించారు.

ఆలయంలో అక్షరాభ్యాసం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సరస్వతి అమ్మవారి ఆలయం ముందు వసంత పంచమి సందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులకు ఓంకార నామంతో పలకలపై, నోటు బుక్కలపై రాసి అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, శివమాల దారులు వంశీధర్ రెడ్డి, రాజు, నాగరాజు, శర్నయ్య, నాగేష్ పాల్గొన్నారు.



రాజోళి పాఠశాల వద్ద సరస్వతీ విగ్రహావిష్కర చేస్తున్న దాత, పాఠశాల సిబ్బంది



ఉత్తనూరులో సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి ప్రభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, యాగశాల, చతుస్థానార్చనలు, ఆయుష్యహోమం, లఘుపూర్ణాహుతి బలిహరణ, పల్లకీసేవ, నివేదన, మారతి, తీర్థగోష్టి కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా విష్ణుసహస్రనామస్తోస్త్ర పారాయణం, యాగశాల చతుస్థానాచర్చనలు, నిత్యహోమం, లఘు పూర్ణాహుతి నివేదన, హారతి, హోమం నిర్వహించారు. తీర్థగోష్టి, గజవాహన సేవ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి శ్రీవారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

పెద్దచింతరేవులలో జాతర కళకళ



కుంకుమ విక్రయానికి సిద్ధంగా ఉన్న వ్యాపారి



బ్యాగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో వెలిసిన తినుబండారాలతో పాటు పిల్లల ఆట వస్తువులు, మిఠాయి దుకాణాలు, మహిళలకు ప్రీతిప్రదమైన గాజుల దుకాణాలు కిక్కిరిశాయి. జాతర గుర్తుగా వస్తువులు, ఆట పరికరాలను కొనుగోలు చేసేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



మాట్లాడుతున్న ఆంజనేయులు

గద్వాల అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. దీనికి నిరసనగా 16న దేశ వ్యాప్త భారత్ బంద్‌కు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలు, ప్రజలు అధిక పాల్గొని గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు హనుమేష్, నరేష్ ఉన్నారు.

రేపు గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హలీమ్ పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో కృష్ణ, హరీష్, నరేష్ ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దేవదాసులు అన్నారు. ఎర్రవల్లి, ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలలో హమాలీ కార్మికులతో కలిసి జాతీయ సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు బీచుపల్లి, తిరుపలి, తి మ్మప్ప, నరసింహ, జగన్, రామకృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన సుధాకర్ రావు, అరుణాబాయి దంపతులు

అయిజ: మండల కేంద్రానికి చెందిన సుధాకర్ రావు, అరుణ బాయి దంపతులు తమ కుమారుడు జగదీష్ రావు జ్ఞాపకార్థం బుధవారం మండలంలోని ఉత్తనూరులో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుకోవడానికి అనువుగా తన చేతనైనంతగా సహాయం చేస్తానని అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తెచ్చిపెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన టీఎస్‌పీఎల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న సీఐ ప్రదీప్ కుమార్

అయిజ: మండల కేంద్రంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయం సమీపంలో 13 రోజులపాటు నిర్వహించిన తిక్కవీరేశ్వర స్వామి ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ప్రథమ బహుమతిని అజయ్ లెవెన్, ద్వితీయ బహుమతిని యూనిక్ స్పోర్ట్స్ గెలుపొందారు. శాంతినగర్ సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ నరేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు నగదు బహుమతులు, కప్పులు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్షావలి ఆచారి, తనగల సీతారామిరెడ్డి, బహుమతుల దాత మురారి సోమశేఖర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో పనిచేస్తేనే కార్మికులకు భవిష్యత్



శాంతినగర్: నూతన విధానాలతో నిర్మాణరంగ పరిశ్రమలో పనిచేస్తేనే కార్మికులకు మంచి భవిష్యత్ ఉంటుందని సీఐడీసీ ట్రెనింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో కార్మికుల సంక్షేమ మండలి, కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్మాణరంగంలో నైపుణ్య శిక్షణపై 15 రోజులుగా కార్మికులకు శిక్షణ కార్యక్రమం కొనసాగిందన్నారు. కార్యక్రమంలో సీఐడీసీ చీఫ్ టెక్నికల్ అడ్వైజర్ యండీ హసీబ్, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మానవపాడు: నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కోసం మండల కేంద్రంలోని 33/11 కేవీ మానవపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో, నారాయణపురం ఫీడర్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేయడానికి గురువారం విద్యుత్‌ను నిలిపేస్తున్నట్లు బుధవారం విద్యుత్ ఏడీఈ సయ్యద్ మక్బుల్ తెలిపారు. ఈ సందర్భంగా మానవపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.